గురుకులం.. ఆహ్వానిస్తోంది

పేద విద్యార్థులకు అత్యుత్తమ స్థాయిలో విద్యనందించేందుకు ఏర్పాటైన గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు గత నెల నోటిఫికేషన్ విడుదలైంది. ఆదోని మండలం ఆరేకల్‌లోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ విద్యా సంస్థల్లో ఐదో తరగతి, ఇంటర్ ప్రాథమ సంవత్సరంలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఈనెల 23వతేదీలోపు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకసారి సీటు పొందితే వసతితో పాటు ఇంటర్మీడియెట్ వరకు ఉచితంగా చదువుకునే అవకాశం కలుగుతుంది. ఇంగ్లిష్ బోధనతో పాటు నీట్, ఐఐటీలో ఉచితంగా శిక్షణ ఇస్తారు.

- ఆరేకల్ బాలికల గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- 5వ తరగతిలో 80 సీట్లు
- ఇంటర్ ఎంపీసీ–40, బైపీసీ–40 సీట్లకు అడ్మిషన్లు
- సీబీఎస్‌ఈ విద్య, ఉచిత వసతి
- దరఖాస్తుకు ఈనెల 23 వరకు గడువు
- మార్చి 10వ ప్రవేశ పరీక్ష

ఆదోని సెంట్రల్: కార్పొరేట్ స్థాయి విద్య, వసతులు బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యాలయాల సొంతం. ఇక్కడ సీటు సాధిస్తే ఉన్నత విద్యకు, మంచి భవిష్యత్తుకు ఢోకా ఉండదు. గత ఏడాది నుంచి సీబీఎస్‌ఈ సిలబస్ బోధన చేస్తున్నారు. రుచికరమైన పౌష్టికాహారం, విద్యాలయ ప్రాంగణంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ, ఇంటర్ స్థాయిలో ఐఐటీ, జేఈఈ వంటి పోటీ పరీక్షలకు ప్రతేక శిక్షణ ఇస్తారు. ఈ విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హతలు ఇవీ..

ఐదో తరగతిలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2011 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ఓసీ, బీసీ,ఎస్సీ, బీసీ–సీ, విద్యార్థులు 2013 సెంప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉన్న వారు అర్హులు. 3,4 తరగతులు గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివి ఉండాలి. ఇక జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు 2023–24 ఏడాదిలో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న వారు అర్హులు. వయసు 2024 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు దాటి ఉండరాదు. ఎస్సీ గురుకులాల్లో చదువుకున్న విద్యార్థులకు ఒక ఎడాది సడలింపు ఇస్తారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్ష లోపు ఉండాలి.



ఆరేకల్ గురుకుల విద్యాలయం

సీట్ల రిజర్వేషన్ ఇలా..

డాక్టర్ బీర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో సీట్ల రిజర్వేషన్ ఇలా ఉంటాయి. ఎస్సీ–75 శాతం, ఎస్సీ–(కన్వర్టడ్ క్రిస్టియన్ (బీసీ–సీ)–12 శాతం, ఎస్టీ–6 శాతం, బీసీ–5 శాతం, ఓసీ–2 శాతం చొప్పున సీట్లు కేటాయించారు. ఎస్సీ గురుకులాల్లో చదివిన విద్యార్థులకు 60 శాతం సీట్లు, మిగతా 40 సీట్లు ఇతర స్కూళ్లలో చదివిన విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు.

దరఖాస్తు విధానం

గురుకుల విద్యాలయంలో ప్రవేశం పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తూ చేసుకోవాల్సి ఉంటుంది. జనవరి 25వ తేదీ నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తీసుకుంటున్నారు. [illegible] వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకోవడానికి 23.02.2024 చివరి తేదీగా నిర్ణయించారు. ప్రవేశ పరీక్ష 10.03.2024 ఉంటుంది. 5వ తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులకు ఉదయం 10 గంటలు నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుంది. అదే ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటలు వరకు ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న కామన్ ఎంట్రెన్స్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన వారి జాబితాను ప్రకటించి, మెరిట్ ఆధారంగా సీట్లను భర్తీ చేస్తారు.


ఐఎఫ్‌పీ ప్యానెల్ ద్వారా డిజిటల్ విద్యాబోధన

గురుకులంలో ప్రత్యేకతలు

- అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో బోధన
- విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ
- ఐఐటీ, నీట్, ఎంసెట్ పోటీ పరీక్షలకు నిపుణులతో శిక్షణ
- డిజిటల్ తరగతులు, కంప్యూటర్ విద్య, స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు
- క్రీడలు, యోగాలో తర్ఫీదు

ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాం



గురుకులంలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక చొరవ తీసుకుని విద్యను అందిస్తున్నాం. చదువుతో పాటు క్రీడలు, ఐఐటీ, జేఈఈ వంటి వాటిలో ప్రతిభ చాటే విధంగా తర్ఫీదు ఇస్తాం. నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నాం. ఈ ఏడాది ఐదు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇది చక్కని అవకాశం. ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలి.

–శివలక్ష్మి, బి.అర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయం, ఆరేకల్లు

సద్వినియోగం చేసుకోండి




పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇది మంచి అవకాశం. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నాం. ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణలో నాణ్యమైన విద్యాబోధన ఉంటుంది. గురుకుల విద్యాలయల్లో విద్యార్థులకు అమ్మఒడి, విద్యాకానుక, ఉచిత పుస్తకాలు, యూనిఫాం అందుతోంది. ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు తీసుకున్న కోర్సులతో పాటు అదనంగా టెక్నికల్ కోర్సులను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి.

–సునీత, ప్రిన్సిపల్, ఆరేకల్లు గురుకులం

క్లుప్తంగా

బావూజీపేటలో వీధి దీపాల ఏర్పాటు


వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఆదోనిటౌన్: పట్టణంలోని 2వ వార్డు బావూజీపేటలో ఆదివారం వీధి దీపాలు ఏర్పాటు చేశారు. కొత్తగా మూడు స్తంభాల ఏర్పాటుతో పాటు పాత వాటిలో ఐదు లైట్లను వేయించినట్లు కౌన్సిలర్ సురేష్ తెలిపారు. దీనిపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కోసిగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మాధవ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని ఆయా శాఖల అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, పనుల పురోగతితో కూడిన నివేదికలతో హాజరుకావాలన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తప్పక హాజరుకావాలని కోరారు.

నేడు కుంబళనూరు క్యాంపునకు ఎమ్మెల్యే రాక

కౌతాళం: మండల పరిధిలోని కుంబళనూరు క్యాంపు–1లో జలజీవన్‌మిషన్ పథకం కింద ఏర్పాటు చేసిన తాగునీటి పైప్‌లైన్‌ను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సోమవారం ప్రారంభించనున్నారు. రూ. 31 లక్షలతో చేసిన ఈ పనుల ద్వారా కుంబళనూరు క్యాంపు–1, క్యాంపు–2కు తాగునీరు సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య తెలిపారు. తుంగభద్రనది నుంచి పైప్‌లైన్‌తో పాటు క్యాంపు–1లో సంప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సంప్ నుంచి రెండు క్యాంపులకు తాగునీరు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

పెద్దతుంబళంలో సీసీరోడ్డు పనులు ప్రారంభం


రోడ్డును చదును చేస్తున్న జేసీబీ

ఆదోనిరూరల్: పెద్దతుంబళం గ్రామంలోని శ్రీతిమ్మప్పస్వామి ఆలయ రహదారిలో సీసీ రోడ్లు, పైపులైన్ పనులను చేయాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కాంట్రాక్టర్ బసవరాజు ఆదివారం ప్రొక్లెయిన్‌తో పనులు ప్రారంభించారు. రోడ్డును చదును చేశారు. ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా గ్రామంలో సీసీరోడ్డు, పైపులైన్ పనులు ప్రారంభమయ్యాయి.

యార్డుకు పెరిగిన ఎండుమిర్చి


రైతులు తెచ్చిన ఎండుమిర్చి బస్తాలు

ఆదోనిఅర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రోజురోజుకు ఎండుమిర్చి దిగుబడులు పెరుగుతున్నాయి. వారంలో రెండు రోజులు బుధవారం, ఆదివారం జరుపుతున్న ఎండుమిర్చి యార్డులో ఆదివారం 2,231 సంచుల ఎండుమిర్చిని రైతులు తీసుకొచ్చారు. ఇందుకు గరిష్టంగా రూ.24,800, మధ్య రూ.15,009, కనిష్ట రూ.6,010గా నమోదైంది. అదేవిధంగా బ్యాడిగి రకం గరిష్టం రూ.24,800, కడ్డీ బ్యాడిగి రూ.18,069, డీలక్స్ రూ.14,600, లాలీ రకం రూ.13,599, తేజ రకం రూ.18 వేలు, సింజంట రకం రూ.12,459, డీడీ రకం రూ.13,539, శివరంజని రకం రూ.12 వేలు, సూపర్–10 రకం రూ.13,999, 5531 రకం రూ.15,009, 1081 రకం రూ.15,300, తాలు రకం రూ.8311, 2043 రకం రూ.18,069, హనుమాన్ రకం గరిష్ట ధర రూ.13,222గా నమోదయ్యాయి. ఇక నుంచి ప్రతి ఆదివారం జరగాల్సిన మిర్చి మార్కెట్ శనివారం, బుధవారం నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

అలరించిన సంగీత విభావరి

కర్నూలు కల్చరల్: పద్మశ్రీ ఘంటసాల 50వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం రాత్రి సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఘంటసాల సంగీత విభావరి నిర్వహించారు. ఘంటసాల చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన పరమపదించి 50 సంవత్సరాలు అయినా ఘంటసాల పాటలకు ఇప్పటికి ఆదరణ తగ్గలేదని వక్తలు పేర్కొన్నారు. గాయకులు షేక్ ఖాదర్ బాషా, షేక్ హబీబ్, రాధిక, సంగీత బృందం శ్రీనివాసులు, రమణయ్య ఆలపించిన పాటలు అలరించాయి. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియ్యా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మవ్వ ఆలయ ప్రారంభోత్సవం


భారీగా తరలివచ్చిన భక్తులు


పూజలందుకున్న పెద్దమ్మవ్వ

ఆదోనిరూరల్: మండలంలోని చిన్నపెండేకల్ గ్రామంలో పెద్దమ్మవ్వ నూతన ఆలయ ప్రారంభ వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. గ్రామ పెద్దలు, శ్రీశైల దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే వీరభద్ర దైవాజ్ఞ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. క్రేన్ సాయంతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ, అమ్మవారి ప్రాణప్రతిష్ఠ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు.


క్రేన్ సాయంతో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: దసరా ఉత్సవాలకు జిల్లాలో ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. ఆలయ పూజారులు స్వామివారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, బండరార్చన, కుంకుమార్చన, పుష్పార్చన, మహా మంగళారతి, ఆకుపూజ, నివేదన, నీరాజన తదితర పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి విరాట్ మూర్తులకు పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులే గాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు స్థానిక ఆస్పరి మఠంలో అన్నదానం చేశారు.


మాళ మల్లేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న పూజారులు

25న వృషభాల బండలాగుడు పోటీలు

మద్దికెర: మండల కేంద్రంలో మద్దమాంబ జాతర పురస్కరించుకొని ఈనెల 25వ తేదీన జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో రాష్ట్రస్థాయి న్యూ కేటగిరీ ఒంగోలుజాతి ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. విజేత వృషభాల యజమానులకు ఎంపీపీ డీఎస్ అనితాయాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు బ్రదర్స్ మొదటి బహుమతి రూ.60,116, కోడుమూరు కేశవులు, గొడుగువేణు రెండవ బహుమతి రూ.40 వేలు, మైత్రి స్కూల్ ఆనంద్‌రావు మూడవ బహుమతి రూ.30 వేలు, శ్రీకృష్ణయూత్ నాల్గవ బహుమతి రూ.20 వేలు, కవిరెడ్డి రామాంజనేయులు ఐదవ బహుమతి రూ.10,116, ఆకుల ఖాజావలి ఆరవ బహుమతి రూ.5116 అందించనున్నట్లు చెప్పారు. పోటీల రోజున కిట్టి, నాగేష్, శ్రీరాములు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆసక్తిగల వారు 25వ తేదీ ఉదయం 7:30 గంటల్లోపు పేరు నమోదు చేయించుకోవాలని, వివరాలకు 98494 09827 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలన్నారు.


25న చిట్యాలలో..

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో లాలూస్వామి ఉరుసు సందర్భంగా ఈ నెల 25న రాష్ట్రస్థాయి పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. పేర్ల నమోదుకు 77026 30416, 99890 28249 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

కామోత్సవ దహనం పుస్తకావిష్కరణ

కర్నూలు (న్యూటౌన్): అశ్లీలత ప్రతిఘటన వేదిక ప్రచురించిన ఈదర గోపిచంద్ సంపాదకత్వంలో వచ్చిన 'కామోత్సవ దహనం, విషపుతేలు పుస్తకాలను స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో ఆదివారం జేవీవీ జాతీయ నేత మహమ్మద్‌మియా అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ గ్రంథాలయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ కల్కూర, తెలుగు భాషా వికాసోద్యమకారులు జేఎస్‌ఆర్‌కే శర్మ హాజరై మాట్లాడుతూ 36 ఏళ్ల క్రితం నాటి అశ్లీల సినిమాలు, సీరియల్స్, తిరునాళ్ల నృత్యాలు, టీవీ ప్రోగ్రాంలపై అవిశ్రాంతంగా అనేక సంఘాలు పోరాటమే ఆధునిక సాంఘిక సంస్కృతికరంగ సంస్కరణోద్యమంలో ఒక ఉజ్వలఘట్టమని కొనియాడారు.

మానసిక ప్రశాంతత అలవర్చుకోవాలి


ప్రసంగిస్తున్న తురియానంద సరస్వతి

ఆదోనిఅర్బన్: విద్యార్థులు మానసిక ప్రశాంతతను అలవర్చుకోవాలని చిన్మయ మిషన్ స్వామిజీ తురియానంద సరస్వతి అన్నారు. ఆదివారం 'యువతకు భారత దేశ ఉన్నత స్థితి–యువత పాత్ర' అనే అంశంపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఎర్రకోట ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో ఎదగాలంటే సామాజిక మార్పును గమనిస్తూ సమస్యలను అధిగమించే శక్తిని పెంచుకోవాలని తెలిపారు. మానసిక ప్రశాంతతను కలిగి ఉండాలని సూచించారు. ట్రస్ట్ ప్రతినిధులు బ్రహ్మచారి నారాయణ, చైతన్య, సుజాతమ్మ, రఘునాథ్, కేశవ పాల్గొన్నారు.


పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా మధ్వనవమి వేడుకలు


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ఆదోనిఅర్బన్: మధ్వనవమిని పురస్కరించుకుని స్థానిక మంగరాయ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ మేనేజర్ వాసుదేవ రావు ఆధ్వర్యంలో మంగరాయ అంజనేయస్వామికి ఫల పంచామృతాభిషేకం, నైవేద్యం, మహా మంగళహారతి సమర్పించారు. అనంతరం ఆంజనేయస్వామి అవతారంలో ఉన్న మధ్వాచార్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆంజనేయస్వామి, భీమసేనుడు, మధ్వాచార్యుల చిత్రపటాలకు పూజలు, హోమాలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో పల్లకీసేవ, రథోత్సవం నిర్వహించారు. బ్రాహ్మణ భక్తులకు అన్నప్రసాదం చేశారు.


రథాన్ని లాగుతున్న భక్తులు

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

ఓర్వకల్లు : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ..కోలుకోలేక శనివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఓర్వకల్లు గ్రామంలోని శ్రీచెన్నకేశవస్వామి దేవాలయం వద్ద నివాసముంటున్న తంబలి దానయ్య కుమారుడు తంబలి నాగేశ్వరయ్య(50) పంట దిగుబడులు సరిగా రాకపోవడం, వ్యవసాయం కోసం తెచ్చిన అప్పులు తీర్చలేకపోవడం, 9 నెలల క్రితమే భార్య జయంతి అనారోగ్యంతో మృతి చెందడంతో తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 16వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, గమనించిన కుటుంబ సభ్యులు చికిత్సకోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ.. కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. మృతుని కుమార్తె భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.


కాత్రికిలోని బీసీ కాలనీలో డ్రైనేజీ ఏర్పాటుకు ముందు (నాడు)


డ్రైనేజీ గ్రావెల్ ఏర్పాటు తర్వాత (నేడు)

కాత్రికి గ్రామ రోడ్లు కళకళ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న గ్రామాలు రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణంతో కొత్త రూపును సంతరించుకుంటున్నాయి. కౌతాళం మండల పరిధిలోని కాత్రికి గ్రామంలో గడప గడప నిధులతో డ్రేనేజీల నిర్మాణం, గ్రావెల్ రోడ్డు, సిమెంటు రోడ్ల నిర్మాణం పూర్తికావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కాలనీలో రూ. 6.50లక్షలతో సిమెంటు రోడ్డును పూర్తి చేశారు. అలాగే రూ. 10లక్షలతో రెండు కాలనీల్లో డ్రైనేజీ నిర్మాణాలతో పాటు గ్రావెల్ కూడా పూర్తి చేసినట్లు పంచాయితీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

–కౌతాళం


ఎస్సీ కాలనీలో రోడ్డు దుస్థితి (నాడు)


సిమెంటు రోడ్డు నిర్మాణం తర్వాత (నేడు)


బురదమయంగా ఉన్న నదిచాగి రోడ్డు (నాడు)


డ్రైనేజీ, గ్రావెల్ రోడ్డుతో ఇలా (నేడు)

సిద్ధం సభకు భారీగా తరలివెళ్లిన నాయకులు


వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్తున్న నాయకులు


గణేకల్ నుంచి తరలివెళ్తున్న ప్రజలు


ఆరేకల్ నుంచి..

ఆదోనిటౌన్/ఆదోనిరూరల్: అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన 'సిద్ధం' సభకు ఆదివారం ఆదోని మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదోని పట్టణం నుంచి భారీగా తరలివెళ్లారు. 60 ఆర్టీసీ బస్సులు, 50 ప్రైవేట్ బస్సులు, 50 కార్లలో సుమారు 3 వేల మంది వెళ్లారు. ఆస్పరి రోడ్డులోని బాటమారెమ్మవ్వ గుడి వద్ద నుంచి వాహనాలు తరలివెళ్లాయి. అలాగే మేజర్ పంచాయతీ మండిగిరిలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, నాయకులు పాండురంగారెడ్డి, అడ్వకేట్ హరినాథ రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్, సలకలకొండ వీరారెడ్డి, దొమ్మర లక్ష్మన్న, మండిగిరి విద్యాకమిటీ చైర్మన్ ఉలిగప్ప, నాయకులు కడితోట ఈరన్న, కార్తీక్, గోవిందు, సోమిరెడ్డి, దామోదర్‌రెడ్డి, కురువ నాగరాజు, భరత్‌నగర్ వీరేష్ ఆధ్వర్యంలో రెండు బస్సులు, మూడు కార్లలో సిద్ధం సభకు తరలివెళ్లారు. అలాగే మండలంలోని పెద్దతుంబళం, గణేకల్, ఆరేకల్ గ్రామాల నుంచి సర్పంచ్ ఉచ్చప్ప, బసవరాజ్ ఆధ్వర్యంలో రెండు బస్సులు, పెద్దహరివాణం గ్రామంలో సర్పంచ్ రాముడు, వైస్ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు బస్సులు, మదిరె గ్రామంలో సర్పంచ్ నారాయణ, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు బస్సులు, కపటి గ్రామంలో మాజీ సర్పంచ్ రాజు ఆధ్వర్యంలో రెండు బస్సులు, దొడ్డనగేరి గ్రామంలో మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ శివశంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో రెండు బస్సులు, ఆరేకల్ నుంచి బైచిగేరి, నాగలాపురం, ఢణాపురం, నాగనాథనహళ్లి తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సిద్ధం సభకు తరలివెళ్లారు.


కోసిగి: సభకు వెళుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోసిగి: మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా రాప్తాడుకు తరలివెళ్లారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో 10 బస్సులు, 20 ప్రైవేట్ వాహనాల్లో వెళ్లారు. ఎంపీపీ ఈరన్న, పార్టీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ ఉన్నారు.